సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024

న్యూస్‌రీల్

అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో జెడ్పీ చైర్మన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని జిల్లా జెడ్పీ చైర్మన్ రోజాశర్మ పిలుపునిచ్చారు. గురువారం జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో భాగంగా శిశుసంక్షేమ, పనులు, ఆర్థిక ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేయాలని ఆదేశించారు. మహిళ భవన్‌లో అవసరమైన శిక్షణ తరగతులు, చేపట్టాల్సిన చర్యలపై ఆరా తీశారు. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని, జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందజేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యాధరికి విశేషాభిషేకం



దాతలకు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): మాఘ శుద్ధ త్రయోదశి గురువారం వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలో ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో వేదపండితులు పూజలకు అంకురార్పణ చేశారు. అమ్మవారి మూలవిరాట్టుకు విశేష అభిషేకం, చండీహోమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణ దంపతులు రూ.3లక్షల విలువైన వెండి హంస వాహనాన్ని, మహంకాళి రాజేశ్వర్ రూ.5లక్షల విలువైన వెండి కమలాన్ని అమ్మవారికి బహూకరించారు. అర్చకులు దాతలను సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నాబార్డు సీజీఎం సుశీల

చేర్యాల(సిద్దిపేట): నాబార్డ్ సహకారంతో 'రివైవల్ ఆఫ్ చేర్యాల్ ఆర్ట్' అనే ప్రాజెక్టులో భాగంగా క్రాఫ్టిజన్ సంస్థ అందించిన శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని చీఫ్ జనరల్ మేనేజర్ నాబార్డ్ తెలంగాణ సుశీల చింతాల సూచించారు. గురువారం మార్కెట్ యార్డు సమీపంలోని నకాషి శిక్షణ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె శిక్షణ పూర్తి చేసిన 35 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలు జీవనోపాధి పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ పౌండేషన్ సీఈఓ బిబు ప్రసాద్, నాబార్డు డీజీఎం శ్వేతా సింగ్, సిద్దిపేట డీడీఎం సెసిల్, సీఈఓ మయూర పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను చేరుకోవాలి

లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సత్యజిత్



గజ్వేల్‌లో మాట్లాడుతున్న సత్యజిత్

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ పథకాల రుణ లక్ష్యలను బ్యాంకర్లు చేరుకోవాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సత్యజిత్ పిలుపునిచ్చారు. ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లీడ్ బ్యాంక్ త్రైమాసిక సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక, మత్స్య పరిశ్రమ కింద కిసాన్ క్రెడిట్ కార్డులు అందించనున్నట్టు చెప్పారు. నాబార్డ్‌లో అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ పథకం ఉందని, అర్హులకు 6 శాతం వడ్డీతో సెక్యూరిటీ లేకుండా రూ.2కోట్ల రుణం లభిస్తుందన్నారు. అదేవిధంగా ఎస్‌హెచ్‌జీ గ్రూప్ రుణాల లక్ష్యాలను ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వారంలో మంజూరు చేయాలి..

హుస్నాబాద్: 320 కేసీసీ దరఖాస్తులను మార్గదర్శకాల ప్రకారం ఒక వారంలో మంజూరు చేయడానికి హుస్నాబాద్ బ్లాక్ మేనేజర్లకు అందజేసినట్లు సత్యజిత్ తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ, మెప్మా, డీఎఫ్‌ఓలు, బ్రాంచి మేనేజర్లు, ఎంపీడీఓలు, ఏపీఎంలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డులు

హుస్నాబాద్‌రూరల్: ఈ నెలాఖరు నాటికి స్వశక్తి మహిళా సంఘాలకు నిర్దేశించిన రుణ లక్ష్యం చేరుకోవాలని, అదనపు రుణాలను కూడా మంజూరు చేయించాలని లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ సత్యజిత్ కోరారు. రుణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసక్తి గల యువత దరఖాస్తు చేసుకొని రుణాలను పొందాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓలు, ఏపీఎంలు, వ్యవసాయ అధికారులు, పశువైద్యులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.



నంగునూరు(సిద్దిపేట): పులిగుండ్ల నుంచి శివసత్తుల పూనకాలతో సమ్మక్కను తీసుకొస్తున్న పూజారి, (ఇన్‌సెట్) కొమురవెల్లి(సిద్దిపేట): మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సమ్మక్క ఆగమనం.. పోటెత్తిన జనసంద్రం

నంగునూరు(సిద్దిపేట): జిల్లాలోని వివిధ గ్రామాల్లో సమ్మక్కను గద్దెకు చేర్చే కార్యక్రమం కనుల పండువగా సాగింది. అక్కెనపల్లిలోని సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. గురువారం గద్దెల ప్రాంగణం జనంతో కిక్కిరిసింది. శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లతో ఆలయ పూజారి శింగరయ్య పులిగుండ్ల ప్రాంతం నుంచి సమ్మక్క ప్రతిమను తెచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. ఆ అపూర్వ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు నిలువెత్తు బెల్లంతో మొక్కులు తీర్చుకున్నారు.

ప్రమాదమా? మానవ తప్పిదమా?

సబ్ స్టేషన్‌లో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

- కాలపరిమితి పూర్తయిందనే అనుమానాలు
- మంత్రి పొన్నం, ట్రాన్స్‌కో డైరెక్టర్ల పరిశీలన
- విచారణకు ఆదేశాలు.. రంగంలోకి టీమ్‌లు

సిద్దిపేటలో ట్రాన్స్‌ఫార్మర్ పేలిన ఘటనపై అధికారులు ఆరా తీస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్‌లోడ్ పడి ప్రమాదవశాత్తు పేలిందా? లేక మానవ తప్పిదం వల్ల జరిగిందా అనే కోణంలో విచారణ చేపట్టారు. అగ్నిప్రమాదం వల్ల నిలిపివేసిన విద్యుత్ సరఫరా అర్ధరాత్రికి పునరుద్ధరించారు. గురువారం సైతం పొగలు అలుముకోవడంతో అగ్నిమాపక సిబ్బంది నియంత్రణకు చర్యలు చేపట్టారు. ట్రాన్స్‌కో డైరెక్టర్‌తో కలసి మంత్రి పొన్నం ప్రభాకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై విచారణకు ఆదేశించారు.



పొగను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్న ఫైర్ సిబ్బంది

సాక్షి, సిద్దిపేట: పట్టణంలో ముస్తాబాద్ చౌరస్తాలోని 220 కేవీ సబ్ స్టేషన్‌లో రెండు 100 ఎంఈఏ, ఒక 160 ఎంవీఏ సామర్థ్యంగల ట్రాన్స్‌ఫార్మర్‌లున్నాయి. వాటికి కరీంనగర్, గజ్వేల్‌ల నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. అక్కడి నుంచి 33 కేవీ 7సబ్ స్టేషన్‌లకు సరఫరా అవుతుంది. 1995లో తయారైన 100ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 1997 మార్చిలో ఏర్పాటు చేశారు. 27 ఏళ్లుగా ఆ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది.

కొనసాగుతున్న మరమ్మతులు

రెండు రోజులుగా సబ్ స్టేషన్‌లోని 100ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు తెలిసింది. బుధవారం కూడా మరమ్మతులు చేపట్టి తొందరపాటుగా బిగించడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని, కొన్ని రోజులుగా మెయింటెనెన్స్ సరిగా లేకపోవడంతోనే ప్రమాదం సంభవించిందని విశ్వసనీయ సమాచారం. మానవ తప్పిదంతోనే పేలుడు జరిగి ఉంటుందని అనుకుంటున్నారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ కాలపరిమితి 25 ఏళ్లు ఉంటుందని, దానిని గమనించకపోవడంతో ఈ ప్రమాదం జరిగిఉంటుందా అని ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది.

విచారణకు టీంల ఏర్పాటు

ట్రాన్స్‌ఫార్మర్ పేలుడుకు కారణం మానవతప్పిదమా? లేక హై ఓల్టేజీనా? అనేది విచారించేందుకు ట్రాన్స్‌కో క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్, ఇన్వెస్టిగేషన్ టీంలను ఏర్పాటు చేసింది. దీంతో అధికారులు గురువారం ఉదయమే ఘటన స్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. ఘటనా స్థలాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి పరిశీలించారు.

కమిటీలు నియమించాం..

ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదం వెనుకగల కారణాలను గుర్తించేందుకు కమిటీలను నియమించాం. ఆ కమిటీలు ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా ముందుకు సాగుతాం. జనవరిలోనే ట్రాన్స్‌ఫార్మర్‌ను టెస్టింగ్‌చేసి విద్యుత్ సరఫరా ప్రారంభించాం.

– జగత్ రెడ్డి, ట్రాన్స్‌కో డైరెక్టర్



నిలువెత్తు బంగారం తూకం వేసుకుంటున్న మంత్రి పొన్నం

ఆటంకం లేకుండా హామీల అమలు

- సమ్మక్క సారలమ్మను మొక్కిన మంత్రి పొన్నం
- నిలువెత్తు బంగారం సమర్పణ

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మల జాతరలో గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఆయనకు కోయ పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. సమ్మక్క సారలమ్మ గద్దెలను మంత్రి దర్శించి నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మలు ఈ ప్రాంత ప్రజలను చల్లంగా చూడాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను ప్రార్థించినట్టు చెప్పారు. తాము ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఏ ఆటంకం లేకుండా అమలయ్యేలా చూడాలని, ప్రజలందరికీ లబ్ధిచేకూర్చే విధంగా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మొక్కుకున్నట్లు తెలిపారు.

నిలువెత్తు బంగారం తూకం..

ఎమ్మెల్యేగా పొన్నం గెలిస్తే నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకుంటానని కౌన్సిలర్ భూక్య సరోజన అమ్మవార్లకు మొక్కుకున్నారు. దీంతో మంత్రి నిలువెత్తు బంగారాన్ని తూకం వేయించి మొక్కుతీర్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చల్లంగా చూడాలి..

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి, అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామాల్లోని సమ్మక్క సారక్క జాతర్లను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సందర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లు ప్రజలను చల్లంగా చూడాలని కోరుకున్నారు. వైస్‌ఎంపీపీ దేవసాని నిర్మల, కల్లెపల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

విచారణకు ఆదేశిస్తాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాద ప్రదేశాన్ని గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్, విద్యుత్‌శాఖ అధికారులను ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. గృహ, వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రమాదంపై విచారణ జరిపించేందుకు ఆదేశిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ మహేశ్ ఆయన వెంట ఉన్నారు.

రూ.98.50కోట్ల బడ్జెట్

బల్దియా పద్దు బరాబర్

- ఆదాయ, వ్యయాల్లో స్వల్ప తేడా
- రూ.2కోట్ల మిగులు బడ్జెట్
- అదనపు కలెక్టర్ సమక్షంలో ఆమోదం

సిద్దిపేటజోన్: జిల్లాలోని ఏకైక స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ సిద్దిపేట బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయ, వ్యయ అంచనాల లెక్క చూస్తే ముగింపు నిల్వ కొంతమేరే కనిపిస్తోంది. వివిధ రూపాల్లో రూ.98.51కోట్ల ఆదాయం, అలాగే రూ.98.50కోట్ల వ్యయ అంచనాతో బడ్జెట్ రూపొందించారు. గత ఏడాది మిగులుతో కలుపుకొని రూ.2 కోట్ల 2లక్షల ముగింపు నిల్వగా పొందుపరిచారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం చైర్ పర్సన్ మంజుల అధ్యక్షతన, జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సమక్షంలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. దానిని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఆదాయం రూ.98.51కోట్లు

వివిధ రకాల పన్నుల రూపంలో రూ.13,78 కోట్లు, మున్సిపల్ దుకాణాల అద్దెల రూపంలో రూ. 3.81 కోట్లు, టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా రూ.11.96 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.6,19 కోట్లు, ఇతర ఆదాయ మార్గాల ద్వారా రూ.27లక్షలు, మొత్తంగా జనరల్ ఫండ్ రూపంలో రూ.36.99 కోట్ల ఆదాయం అంచనా బడ్జెట్‌లో పొందుపరిచారు. దీనికి తోడు డిపాజిట్లు, అడ్వాన్స్‌ల ద్వారా రూ.24.88కోట్లు ఆదాయం, నాన్ ప్లాన్ గ్రాంట్స్ రూపంలో రూ.96లక్షలు, ప్లాన్ గ్రాంట్స్ రూపంలో రూ.20కోట్లు, ఇతర గ్రాంట్స్ రూపంలో రూ.70లక్షలు, క్యాపిటల్ ప్రాజెక్టు ఫండ్ రూపంలో రూ.36.72కోట్లు మొత్తంగా రూ.98.51కోట్ల అంచనా ఆదాయంగా బడ్జెట్‌లో చూపించారు.

ఖర్చులు కూడా అంతే..

ఆదాయానికి దగ్గరగానే వ్యయాన్ని బడ్జెట్‌లో అంచనా రూపొందించారు. చార్జెడ్ వ్యయాలైన మున్సిపల్ సిబ్బంది, ఉద్యోగుల వేతనాలు, జీతాల రూపంలో రూ.12.10కోట్లు, పారిశుద్ధ్య నిర్వహణ కోసం రూ.4.78కోట్లు, విద్యుత్ చార్జీల చెల్లింపు కోసం రూ.7.70కోట్లు, హరిత బడ్జెట్ కింద రూ.3.69కోట్లు, మొత్తంగా రూ.28.33కోట్ల అంచనా వ్యయం. కాగా ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, సాధారణ విభాగాల నిర్వహణ నిమిత్తం రూ.7.57కోట్ల అంచనా వ్యయంగా పొందుపరిచారు. మరోవైపు మురికివాడలు, విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సౌకర్యాలు, వార్డుల వారీగా వివిధ పనుల వ్యయం, సాధారణ నిధితో కలిపి మొత్తంగా రూ.36.89 కోట్ల అంచనా వ్యయం నిర్ణయించారు. డిపాజిట్లు, అడ్వాన్స్ చెల్లింపు, నాన్ ప్లాన్, ప్లాన్ గ్రాంట్స్ ఖర్చులతో మొత్తంగా రూ.36.72కోట్లతో మొత్తం బల్దియావ్యయ అంచనా రూ.98.50 కోట్లుగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. మొత్తంగా పరిశీలిస్తే రూ.కోటి మిగులు నిల్వ కనిపిస్తోంది. గత ఏడాది మిగిలిన నిల్వ రూ.కోటితో మొత్తంగా సిద్దిపేట మున్సిపాలిటీ ముగింపు నిల్వ రూ.రెండు కోట్లు. అనంతరం కౌన్సిల్ సభ్యులు పలు సమస్యలపై చర్చించారు.



సమావేశంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, చైర్మన్ మంజుల, కమిషనర్ ప్రసన్న రాణి, వైస్ చైర్మన్ కనకరాజు

సిద్దిపేట టాప్..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్ల జాబితాలో సిద్దిపేట మొదటి స్థానంలో ఉందని, శత శాతం లక్ష్యం సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేట మున్సిపల్ ఆదర్శంగా ఉండాలని, సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హరితహారంలో నాటిన మొక్కలను వేసవిలో సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్వచ్ఛ బడి, రుతు ప్రేమ అమలు దేశానికి రోల్ మోడల్‌గా ఉన్నాయన్నారు. మున్సిపల్ చైర్మన్ మంజుల, కమిషనర్ ప్రసన్న రాణి మాట్లాడారు. వైస్ చైర్మన్ కనకరాజు, సభ్యులు అరవింద్, యోగి, లక్ష్మణ్, సుందర్, మల్లికార్జున్, విఠోభ, సాయి ఈశ్వర్, బ్రహ్మం, నాగరాజు, మల్లికార్జున్, రియాజ్, రేణుక, కవిత, శ్రీదేవి, కవిత, తస్లిమ్ బేగం, శోభారాణి, పూర్ణిమ, అధికారులు పాల్గొన్నారు.

అవిశ్వాసం ఆసక్తికరం

రెండోసారి తెరపైకి వివాదం

- బలనిరూపణకు కౌన్సిలర్ల పట్టు
- తేదీ ప్రకటిస్తే క్యాంపుకెళ్లే ఆలోచన
- ఇదీ మున్సిపాలిటీలో పరిస్థితి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం వివాదం రెండోసారి తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. గతేడాది ఫిబ్రవరి 9న తాము ఇచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని తిరిగి అమలు చేయాలని కోరుతూ బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు వినతి పత్రం అందజేసిన అసంతృప్త కౌన్సిలర్లు పట్టు వదలడం లేదు. బలనిరూపణకు అవకాశం కల్పించాల్సిందిగా అధికారులను కోరేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ రాజకీయం రసవత్తరంగా మారింది.

మొదటి నుంచి వివాదాలు

నాలుగేళ్ల పదవీ కాలం పూర్తిచేసుకున్న పాలకవర్గంలో తరుచు వివాదాలు కొనసాగుతున్నాయి. 20 మంది సభ్యుల్లో 14 మంది బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందారు. అర్చన, వరలక్ష్మి, దుంబాల లక్ష్మి, విద్యారాణి, రహీమ్, చందన ఇండిపెండెంట్లుగాను, షహనాజ్ కాంగ్రెస్ నుంచి గెలుపొందగా వారు కూడా బీఆర్‌ఎస్‌లో చేరిపోయారు. అయినా వారిలో సఖ్యత కుదరడం లేదు. చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అవినీతిని ప్రోత్సహిస్తున్నారని, ఒంటెద్దు పోకడలతో ముందుకుసాగుతున్నారని మొదటి నుంచి మెజార్టీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

ఆరోపణల పరంపర..

2022 ఫిబ్రవరి 28న పాలకవర్గం సమావేశం తర్వాత బయటకు వచ్చిన మహిళా కౌన్సిలర్లు చైర్మన్ తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బహిరంగా ఆరోపించడం అప్పట్లో కలకలం రేపింది. మొక్కలకు నీళ్లు పోయించకుండానే ట్యాంకర్లకు నెలనెలా లక్షల్లో నిధులు డ్రా చేస్తున్నారని మండిపడ్డారు. ఇళ్ల నిర్మాణ అనుమతుల్లోనూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, లంచాలు అందనిదే అనుమతులు రావడం లేదని ఆరోపించారు. నెలవారీగా సమావేశాల్లో వివిధ రంగాలకు ఖర్చుచేస్తున్న బడ్జెట్ వివరాలను తమకు ఇవ్వాలని కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నా లెక్కలు చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఆరోపణలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

పట్టు వీడని కౌన్సిలర్‌లు

20 మంది కౌన్సిలర్లలో 14 మంది మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిని గద్దె దింపాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారు. గతేడాది ఫిబ్రవరి 9న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌కు వారంతా అవిశ్వాస తీర్మానాన్ని అందజేసిన విషయం తెలిసిందే. వివిధ కారణాల వల్ల అది ఆగిపోయింది. అయితే దానిని ఇప్పుడు కొనసాగించాలని, బల నిరూపణకు సమయం ఇవ్వాలని కోరుతూ అసంతృప్త కౌన్సిలర్లు బుధవారం అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌ను కోరారు. వారిలో అల్వాల బాలేశ్, అత్తెల్లి శ్రీనివాస్, బొగ్గుల చందు, కూరాకుల శ్రీనివాస్, బాలమణి, రజిత, శీర్ల శ్యామల, వరలక్ష్మి ఉన్నారు. అధికారులు అవిశ్వాసానికి తేదీ ప్రకటిస్తే వారంతా క్యాంపుకెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

బడ్జెట్ సమావేశానికి దుమ్మా..

మున్సిపల్ కార్యాలయంలో గురువారం రెండోసారి నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి 14మంది కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. కోరం నిండాలంటే ఏడుగురు సభ్యులు అవసరం. అసంతృప్తుల్లో ఒక కౌన్సిలర్‌ను పట్టణంలోని ఓ ఆసుపత్రి వద్ద నుంచి సముదాయించి తీసుకెళ్లడానికి కొందరు ప్రయత్నించగా, అక్కడే ఉన్న మిగితా అసంతృప్త కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. అంతేకాకుండా చర్చలకు కూడా అసంతృప్త కౌన్సిలర్లు విముఖత చూపినట్లు సమాచారం. దీనిని బట్టి చూస్తే అసంతృప్త కౌన్సిలర్లు అవిశ్వాసానికి గట్టి పట్టుతో ఉన్నారనే విషయం స్పష్టమవుతోంది. కోరంతో సంబంధం లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మున్సిపల్ కమిషనర్ బడ్జెట్ సమావేశం పూర్తిచేశారు. ప్రస్తుత ఈ పరిస్థితుల్లో అవిశ్వాస ప్రక్రియలో నెగ్గెదెవరు? ఓడేదెవరు? అనేది ఆసక్తికరంగా మారింది.



మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం

కోరంతో ప్రమేయం లేకుండా..

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి సంబంధించిన బడ్జెట్‌ను గురువారం ఆమోదించారు. చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2024–25కు సంబంధించిన బడ్జెట్‌ను రూ.18.06కోట్లుగా, మిగులు బడ్జెట్‌ను రూ.27.81కోట్లుగా చూపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, నలుగురు కౌన్సిలర్లు, మరో సభ్యురాలు, అధికారులు పాల్గొన్నారు. కీలకమైన ఈ సమావేశానికి 14 మంది అసంతృప్త కౌన్సిలర్లు హాజరు కాలేదు. దీంతో కోరంతో ప్రమేయం లేకుండా రెండో రోజు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారులు బడ్జెట్ సమావేశం పూర్తిచేశారు.

క్లుప్తంగా

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మల్లారెడ్డి, తదితరులు

సిద్దిపేటకమాన్: హైదరాబాద్‌లో ఈనెల 25వ తేదీన జరగనున్న తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు సంబంధించిన కరపత్రాన్ని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆవిష్కరించారు. మల్లారెడ్డి మాట్లాడుతూ.. సభకు కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్యాభిలాషులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమాశంకర్, రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జైకాతో మెరుగైన సంబంధాలు

ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి



జపాన్ ప్రొఫెసర్లతో బీ.ఎస్.మూర్తి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ ఏజెన్సీ (జైకా) చేపట్టిన కార్యక్రమాలతో భారత్-జపాన్ దేశాల మధ్య విద్యా, సాంస్కృతిక సంబంధాలు మెరుగుపడుతున్నాయని హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి పేర్కొన్నారు. గురువారం ఐఐటీహెచ్‌లోని ఆడిటోరియంలో డిజైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ విద్యా సంస్థ ఐఐటీహెచ్, జైకాలు కలిసి డిజైన్ విభాగంలో నూతన ఆవిష్కరణలను అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఐఐటీహెచ్‌లో పలు భవనాలను డిజైన్ చేసిన జపాన్‌కు చెందిన పలు ప్రముఖ యూని వర్సిటీల డిజైన్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ హైడిటోషి హోనో, యోజోఫిజినో మాట్లాడారు.

డీఎస్పీకి సన్మానం

జహీరాబాద్: నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్‌రెడ్డిని రేషన్ డీలర్ల సంఘం నాయకులు గురువారం కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం కొత్తగా వచ్చిన సీఐ రవి, ఎస్ఐ లక్ష్మారెడ్డిలను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం తాలూకా అధ్యక్షుడు జి.విజేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సద్రుద్దీన్‌గౌరి, సంఘం నాయకులు మచ్చేందర్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

చేర్యాల(సిద్దిపేట): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని చేర్యాల, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఆకునూరు శివారు రోల్లబండ సమీపంలో బొలెరో వాహనంతో రేషన్ బియ్యాన్ని తరలించి డంప్ చేసినట్లు సమాచారం వచ్చింది. ఈ మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి బొలెరో వాహనంతోపాటు 12 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నాం. అలాగే నూనె శేఖర్, నల్లమల శ్రీధర్, కల్యాణపురం సిమిలర్ వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

పాలకవర్గం ప్రశ్నార్థకం!

- మండలి ఏర్పాటులో తీవ్ర జాప్యం
- 20 రోజుల్లో మల్లికార్జున స్వామి జాతర
- 13 ఆలయాల ఇన్‌చార్జి ఈఓతోనే కాలయాపన
- కుంటుపడుతున్న ఆలయ అభివృద్ధి



బడంపేటలో వెలిసిన భద్రకాళి సమేత శ్రీరాచన్న స్వామి ఆలయం

మండలంలోని బడంపేట గ్రామ శివారులో వెలిసిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రకాళి సమేత శ్రీ రాచన్న స్వామి, భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ పాలక మండలి నియామకంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత పాలక మండలి పదవీ కాలం ముగిసి ఏడాది గడుస్తున్నా ఇంత వరకు కొత్త పాలక మండలి నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేయలేదు. దీంతో ఇన్‌చార్జి కార్యనిర్వాహణ అధికారితో కాలం వెళ్లదీస్తున్నారు. తద్వారా ఆశించిన మేరకు అభివృద్ధికి నోచుకోకపోగా స్వామివారిని దర్శంచుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు అసౌకర్యాలకు గురవుతున్నారు.

కోహీర్(జహీరాబాద్)

పాలక మండలి నియామక ప్రక్రియలో దేవాదాయ ధర్మాదాయ శాఖ తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోంది. దీనికి తోడు రాజకీయ నాయకుల జోక్యం పాలక మండలి నియామకం మరింత జాప్యానికి కారణమవుతోంది. 12 ఏళ్లలో కేవలం రెండేళ్లు మాత్రమే పాలక మండలి పని చేసిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 11 సెప్టెంబర్ 2011న రాచయ్య స్వామి నేతృత్వంలో రెండేళ్ల పదవీ కాలం ముగిసిన తర్వాత పాలక మండలి పదవీ కాలం రెండేళ్ల నుంచి ఏడాదికి కుదించారు. 2018 నుంచి 2019లో కనకరత్నం చైర్మన్ నేతృత్వంలోని పాలక మండల ఏడాదిపాటు, 2021 నుంచి 2022 వరకు రాజు స్వామి చైర్మన్‌గా మరో ఏడాది పాటు పాలక మండలి ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. అనంతరం పాలక మండలి నియామకంలో జాప్యం జరుగుతోంది. మార్చిలో 14, 15, 16 తేదీల్లో ఆలయ వార్షిక జాతర నిర్వహించనున్న నేపథ్యంలో కనీసం జాతర ఉత్సవ కమిటీ ఏర్పాటుకు సైతం నోటిఫికేషన్ జారీ చేయలేదు. వెంటనే నోటిఫికేషన్ జారీ చేసి పాలక మండలి నియామకం చేపట్టాల్సిన అవసరం ఉంది.

13 ఆలయాలకు ఒక్కరే ఇన్‌చార్జి..

ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వాహణ అధికారిగా శివరుద్రప్ప కొనసాగుతున్నారు. ఆయన చాంద్రాయణ గుట్ట చెన్నకేశ్వర ఆలయానికి పూర్తి కాలపు ఈఓగా కొనసాగుతున్నారు. అయితే సంగారెడ్డి జిల్లాలో ఐదు ఆలయాలకు, హైదరాబాద్ జిల్లాలో ఎనిమిది మొత్తం 13 ఆలయాల ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తద్వారా ఏ ఒక ఆలయానికి సరైన న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది.

వెంటనే నియమించాలి



బడంపేట శ్రీ రాచన్న స్వామి పాలక మండలి నియామకంలో జాప్యం జరుగుతోంది. హైదరాబాద్‌లోని చాంద్రాయణ గుట్ట చెన్నకేశ్వరస్వామి ఆలయానికి పూర్తి కాలపు ఈఓగా పని చేస్తున్నాను. మరో 13 ఆలయాలకు ఇన్‌చార్జి ఈఓగా కొనసాగుతున్నాను. సిబ్బంది సహకారంతో ఆలయాల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తున్నాను. పాలక మండలిని నియమిస్తేనే అభివృద్ధికి అవకాశం ఉంటుంది.


–శివరుద్రప్ప, ఇన్‌చార్జి ఈఓ

అభివృద్ధికి ఆమడదూరం..

పాలక మండలి ఏర్పాటు కాకపోవడంతో అభివృద్ధి పనులు జరగడం లేదు. ముఖ్యంగా రూ.3 కోట్లతో నిర్మించ తలపెట్టిన రాజగోపుర నిర్మాణం పెండింగ్‌లోనే ఉంది. ఆలయం చుట్టూ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో వార్షిక జాతర ఉత్సవాల్లో రథోత్సవం పూర్తి స్థాయిలో నిర్వహించలేకపోతున్నారు. గోషాల ఏర్పాటు చేయలేదు. భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ధర్మసత్రాలు నిరుపయోగంగా మారాయి. ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులకు విఘాతం కలుగుతోంది. పూర్తిస్థాయి కార్యనిర్వహణ అధికారిని, పాలక మండలిని నియమించి అభివృద్ధికి సహకరించాలని భక్తులు దేవాదాయ ధర్మాదాయ శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.

శభాష్ శంకరాచారి

- విద్యార్థులకు ఉచితంగా సివిల్స్‌లో శిక్షణ
- తాను సాధించకపోయినా, పలువురి కోసం కృషి
- ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు



బోధిస్తున్న శంకరాచారి

బెజ్జంకి(సిద్దిపేట): తాను సాధించకపోయినా తన తరఫున కొందరైనా ఆ లక్ష్యాన్ని సాధించాలని విద్యార్థులకు ఉచితంగా సివిల్స్‌లో శిక్షణ ఇస్తూ శభాష్ అనిపించుకున్నాడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు నారోజు శంకరాచారి. సివిల్స్‌కు విద్యార్థులను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలువురు విద్యార్థులకు సామాజిక మాధ్యమాల ద్వారా మెలకువలు నేర్పిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. బెజ్జంకి మండలంలోని గుగ్గిల్ల గ్రామానికి చెందిన శంకరాచారి సివిల్స్ కోసం చదివినా తృటిలో గ్రూప్–1 అవకాశం చేజారింది. తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 2002లో ఎంపికయ్యాడు. కరీంనగర్‌లో ఉంటూ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాడు. అయినా తృప్తి కలగకపోవడంతో డిగ్రీ చదివి సివిల్స్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులకు కొంత కాలంగా ఉచితంగా శిక్షణ ఇస్తున్నాడు. సొంతంగా రూ.70 వేలు వెచ్చించి స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించారు. ప్రస్తుతం బెజ్జంకి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న శంకరాచారి 'నా గమ్యం ఐఏఎస్' అనే పుస్తకాన్ని ప్రచురించాడు. అప్పుడున్న పరిస్థితుల్లో తాను ఐఏఎస్ అయ్యి ప్రజలకు సేవలందించే అవకాశం రాకపోయినా, మరికొంత మంది విద్యార్థులను తీర్చిదిద్ది వారి ద్వారా ప్రజలకు సేవచేయాలనే సంకల్పంతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

అక్రమ మైనింగ్ కంపెనీలు సీజ్

- 79 వాహనాలకు రూ.22 లక్షల జరిమానా
- ఆర్డీఓ రవీందర్ రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి

సంగారెడ్డి: అక్రమ మైనింగ్ కంపెనీలు సీజ్ చేసి, అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు జరిమానా విధించినట్లు మైనింగ్, చెరువుల సంరక్షణ కమిటీ కన్వీనర్, ఆర్డీఓ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం సంగారెడ్డి రెవెన్యూ డివిజినల్ పరిధిలో అక్రమ మైనింగ్, చెరువుల సంరక్షణ కమిటీతో ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. సంగారెడ్డి డివిజినల్ పరిధిలో పటాన్‌చెరు మండలం లక్డారం, జిన్నారం మండలం ఖాజీపల్లిలో మొత్తం 78 మైనింగ్ కంపెనీలు ఉన్నాయన్నారు. ఇందులో ఐదు కంపెనీలు నిబంధనలకు లోబడి పని చేయపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. రవాణా శాఖ అధికారులు అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలను గుర్తించి 79 వాహనాలకు రూ. 22 లక్షలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ కంపెనీలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మైన్స్ ఏడీ మధుకుమార్ పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన స్థానం డైరెక్టర్ సురేశ్



తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సిద్దిపేటఅర్బన్: ఆయిల్ పామ్ తోటల్లో సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జాతీయ ఆయిల్ పామ్ పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ సురేశ్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రామచంద్రుడు రైతులకు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో రైతు ఎల్లాగౌడ్ సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆయిల్ పామ్ సాగు చేసి లాభాల బాటలో పయనించాలని సూచించారు. ఆయిల్ పామ్ తోటలకు తగినంత నీరు అందించాలని, సేంద్రియ, కాంప్లెక్స్ ఎరువులను వేసుకోవడం ద్వారా తోట వృద్ధి బాగుంటుందని సూచించారు. చెట్లు నాటినప్పటి నుంచి 30 నెలల్లోపు చెట్లకు వచ్చే పూత, కాత తొలగించాలన్నారు. జిల్లాలో 11 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగులో ఉన్నాయని తెలిపారు. వచ్చే ఆగస్టు నెలలో 2500 ఎకరాల్లో పంట చేతికొస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి సునీత, ఆయిల్ ఫెడ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మోదీనే

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి
- నేటి కార్నర్ స్ట్రీట్ మీటింగ్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న గోదావరి

పటాన్‌చెరు టౌన్: గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో ఈసారి కూడా ప్రధాని మోదీనే అని, ఆయన ఆదేశాలతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి చేపట్టిన రాజరాజేశ్వరి సంకల్పయాత్ర ఐదు క్లస్టర్లలో చేపట్టడం జరిగిందని జిల్లా భాజపా అధ్యక్షురాలు గోదావరి తెలిపారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని అతిథి గృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాండూరు, చేవెళ్ల, రాజేంద్రనగర్ పూర్తి చేసుకొని శుక్రవారం సాయంత్రానికి మెదక్ పార్లమెంటు పరిధిలోకి ప్రవేశించనుందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాల్లో భాజపాను గెలిపించడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. శుక్రవారం లింగపల్లి నుంచి బస్సు యాత్రకు స్వాగతం పలికి, పటాన్‌చెరులో కార్నర్ స్ట్రీట్ సమావేశం ఉంటుందని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరునాడు ఉదయం గణేశ్ గడ్డ దేవాలయంలో పూజలు చేసి సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రవేశిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, కులకర్ణి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేశ్, మున్సిపల్ అధ్యక్షుడు ఆగారెడ్డి, గుమ్మడిదల మండలం కమిటీ అధ్యక్షుడు గోవర్ధన్, అసెంబ్లీ మాజీ కన్వీనర్ నర్సింగరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో ఉద్యోగులు

రూ.21.63 లక్షలు పోగొట్టుకున్న ఇద్దరు బాధితులు

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడి ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు నగదు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగినికి డిసెంబర్ 15వ తేదీన పార్ట్ టైం జాబ్ ఉందంటూ మెసేజ్ వచ్చింది. పెట్టిన నగదుకు కమీషన్ ఇస్తామని చెప్పడంతో బాధితురాలు వివరాలను నమోదు చేసి పలు దఫాలుగా రూ.15 లక్షలు పెట్టింది. కమీషన్ ఇవ్వాలని అడగడంతో స్పందించలేదు. బాధితురాలు తాను మోసపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో అమీన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తికి జాబ్ ఆఫర్ అంటూ డిసెంబర్ 28వ తేదీన మెసేజ్ వచ్చింది. నగదు ఇన్వెస్ట్ చేస్తే కమీషన్ ఇస్తామని ఆశ చూపడంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి రూ.6లక్షల 63 వేలు పంపించాడు. తీరా పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో సైబర్ నేరగాళ్లు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి గురువారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ముఠా గుట్టురట్టు

- ఇద్దరి అరెస్టు, వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ బాలాజీ



నిందితులతో ఏసీపీ బాలాజీ

వర్గల్(గజ్వేల్): వివిధ ప్రాంతాల్లో సెంట్రింగ్ బాక్సుల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును వర్గల్ మండలం గౌరారం పోలీసులు రట్టు చేశారు. ముఠాలోని ఇద్దరు సభ్యులను అరెస్టు చేసి, 17 మందితో కూడిన ముఠా సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలో అనేక నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. ముఠాకు సంబంధించిన వివరాలను గురువారం గౌరారం పోలీస్‌స్టేషన్ వద్ద గజ్వేల్ ఏసీపీ బాలాజీ వెల్లడించారు. నల్గొండ జిల్లా పడమటి తండాకు చెందిన ముడావత్ హరి(28), దేవరకొండ, గాజీనగర్‌కు చెందిన జంపుల రాంలాల్(33), మరో 17 మంది సభ్యులు ముఠాగా సెంట్రింగ్ బాక్సుల చోరీకి పాల్పడుతున్నారు. కొన్ని రోజుల నుంచి సిద్దిపేట, మెదక్ జిల్లాలలో బాక్సులు చోరీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏసీపీ బాలాజీ ఆదేశాల మేరకు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో గురువారం ఉదయం 6 గంటలకు గౌరారం ఎస్సై శివకుమార్ తన సిబ్బందితో కలిసి రాజీవ్ రహదారి వర్గల్ కమాన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ వైపు నుంచి గౌరారం వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనంలో ముడావత్ హరి(28), జంపుల రాంలాల్(33) పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలు అన్నీ బయటపడ్డాయి. వీరితోపాటు 17 మంది సభ్యులు ఉన్నట్లు గుర్తించారు. ఇద్దరిన ఉంచి అశోక్ లేలాండ్ వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. సమావేశంలో రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్సై శివకుమార్, ఏఎస్సై మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

- తూప్రాన్‌లో రెండు ఇళ్లలో దొంగతనం
- నగదు బంగారం అపహరణ
- మరో రెండు ఏటీఎంలో చోరీకి యత్నం

తూప్రాన్: తూప్రాన్‌లో దొంగలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. పట్టణ పరిధిలోని పోతరాజుపల్లిలోని రెండు ఏటీఎంలు, రెండు తాళం వేసిన ఇళ్లలో గురువారం దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతరాజుపల్లిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంలో దొంగలు చోరీకి యత్నించారు. విద్యుత్ వైర్లు, సీసీ కెమెరా, అలారం వైర్లు కత్తిరించి వేశారు. కానీ ఎలాంటి నగదు పోలేదు. అలాగే, సమీపంలోని ఇండియన్ బ్యాంక్ ఏటీఎంలో చోరీకి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్‌టీంను రప్పించి నిందితుల వేలిముద్రలు సేకరిస్తున్న క్రమంలోనే మరో చోట చోరీ జరిగినట్టు సమాచారం వచ్చింది. పట్టణంలోని టాటా కాఫీ కాలనీలో నివాసం ఉంటున్న ఉమారాణి ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తుంది. ఉదయం ఆమె పాఠశాలకు వెళ్లగా, భర్త తిరుమలరావు మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి వాహనంలో పెట్రోల్ పోసుకునేందుకు బయటకు వెళ్లాడు. అతడు తిరిగొచ్చేలోపే ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లారు. వెంటనే తిరుమలరావు భార్యతోపాటు పోలీసులకు సమాచారం అందించగా క్లూస్ అధికారులు శ్రీధర్‌గౌడ్, రమేశ్‌రెడ్డి ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. అలాగే బస్టాండ్ సమీపంలోని సుల్తానా ఇంట్లో రాత్రి తాళం పగులగొట్టి అర తులం బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



నిందితుల వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

అక్రమంగా మట్టి తరలింపు

జేసీబీ సీజ్

దౌల్తాబాద్(దుబ్బాక): అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించినట్లు దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపారు. మండల పరిధిలోని గొడుగుపల్లి, లింగాయిపల్లి తండా గ్రామ మధ్యలో సంత్రకుంటలో గురువారం రాత్రి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు సమాచారం అందిచారన్నారు. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి జేసీబీని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మర్కూక్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మర్కూక్ మండలంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన బత్తుల రాజు (24) పని నిమిత్తం వర్దరాజ్ పూర్ గ్రామానికి ట్రాక్టర్‌పై వెళ్తున్నాడు. వెనుకాల వస్తున్న కారు అతివేగంతో వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. రాజు రోడ్డుపై ఎగిరి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న వ్యక్తి బెలూన్ తెరుచుకోవడంతో ప్రమాదం నుంచి బయట పడ్డాడు. స్థానికులు గమనించి రాజును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి జైలుకు..

- ఏటీఎంలో దొంగతనానికి యత్నించిన ఇద్దరు అరెస్టు
- నిందితులను పట్టించిన సీసీ కెమెరాలు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

దుబ్బాకటౌన్: జల్సాలకు అలవాటు పడి.. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులు పోలీసులకు చిక్కి కటకటాలపాయ్యారు. మూడు రోజుల క్రితం దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో ఏటీఎంలో దొంగతనానికి యత్నించిన వీరిని సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించి గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలను దుబ్బాక సీఐ శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్‌కు చెందిన రజినీకాంత్, గుర్రాల అనిల్ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కొద్ది రోజులుగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. మూడు రోజుల కిందట (ఈ నెల 19న)మండలంలోని హబ్షీపూర్‌లో ఇండియా వన్ ఏటీఎంలో దొంగతనానికి యత్నించారు. వారు ఆయుధాలతో చోరీ చేస్తుండగా శబ్దం రావడంతో అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న దుబ్బాక పోలీసులు అక్కడికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు. వాటి ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం మోపారని ఆత్మహత్య



రాయగిరి(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): మనస్తాపంతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కౌడిపల్లి మండలంలో గురువా రం వెలుగు చూసింది. ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొట్టాల గ్రామానికి చెందిన గుమ్మాల రాయగిరి (45), భార్య సుజాతలకు ముగ్గురు అమ్మాయిలు ఉండగా, చిన్న కూతురు భవానీని ఇంటి వద్దనే ఇల్లరికం పెట్టుకున్నాడు. అయితే, మనుమరాలి కడియాలు కనపడకపోవడంతో, వాటిని రాయగిరి దొంగిలించి అమ్ముకున్నాడని భార్య సుజాత తరచూ అతడితో గొడవ పడుతోంది. బుధవారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రాయగిరి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటి పక్కనే ఉన్న గుడిసెలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న గుమ్మాల దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.